ప్రజాశక్తి
బుధవారం 26 జూన్ 2024
5
శ్రీకాకుళం



మేఘాలయ సిఎంను కలిసిన కేంద్రమంత్రి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మేఘాలయ ముఖ్యమంత్రి కొన్రాడ్ సంగ్మాను మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఆయన నివాసంలో కలిసి మేఘాలయలో పౌర విమానయాన సేవలను అభివృద్ధి చేసేందుకు అనువైన పరిస్థితులపై చర్చించారు. ఈశాన్య రాష్ట్రాల్లో పౌర విమానయాన సేవలను మరింతగా విస్తృతపరుస్తామని హామీనిచ్చారు.



మత్తు... చిత్తు

ఏ దేశ పురోగతి అయినా ఆ దేశ యువతపైనే ఆధారపడి ఉంటుంది. యువశక్తిని మించింది ఈ భూ మండలంలోనే లేదన్నది ఎవరూ కాదనలేని నిజం. ఈ మధ్యకాలంలో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిపోవడం, ఆ ప్రభావం యువతపైనే ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే విషయం. ఈ మత్తుకు అలవాటు పడ్డారంటే వారి జీవితం చిత్తు అయినట్టే. జిల్లాలోనూ డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగం పెరుగుతోంది. ప్రధానంగా యువత ఈ మత్తుకు బానిసలవుతున్నారు. మాదకద్రవ్యాల విముక్త ప్రపంచాన్ని నిర్మించేందుకు ఏటా జూన్ 26వ తేదీన అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, దుష్ప్రభావాలు, వాటిని అక్రమంగా రవాణా చేయడం వల్ల ఎదురయ్యే చట్టపరమైన చిక్కులపై అవగాహన కలిగించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

- **డ్రగ్స్ బారిన పడుతున్న యువత**
- **మేలుకోకపోతే ముప్పే**
- **నేడు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం**



ప్రజాశక్తి - రణస్థలం

డ్రగ్స్ సరఫరా చేసేవారు చిన్నపిల్లలు, యుక్త వయస్కులనే ఎరగా చేసుకుంటున్నారు. ముందుగా సిగరెట్లు, ఆల్కహాల్ అలవాటు చేయించి మెల్లగా వారిని మత్తు పదార్థాలకు బానిసలుగా మారుస్తున్నారు. రద్దీగా ఉండే కిళ్లీ దుకాణాలు, కాఫీ షాపుల ద్వారా వీటి సరఫరాను సాగిస్తుంటారు. ఈ సిస్టమ్ ఓ చైన్‌లా కొనసాగుతోంది. దీనికోసం ప్రత్యేకంగా డెలివరీ బాయ్స్ కూడా ఉన్నారని అప్పుడప్పుడూ మనం వింటూనే ఉంటాం. పేదింట్లో పుట్టి డ్రగ్స్‌కి అలవాటైన వారు నేరాలు చేయడానికి కూడా వెనకాడట్లేదు. వీటిని కొనడానికి దొంగతనాలు చేయడం వంటి నేరాలకు పాల్పడుతున్నారు. కొందరు డ్రగ్స్‌కు బానిసై సమయానికి అందక ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు. పాకెట్ మనీ ఇవ్వాలని ఇంట్లో వారిని ఇబ్బంది పెడుతూ, పదునైన వస్తువులు చూపించి వారిని భయపెడుతున్న సంఘటనలు చూస్తున్నాం. ఇలాంటి స్థితిలో వారు డబ్బు కోసం ఏదైనా చేయడానికి సిద్ధమై లేనిపోని చిక్కుల్లో ఇరుక్కుంటున్నారు. హత్యలు చేయడానికి సైతం వెనకాడకుండా చివరకు జైలు గోడల మధ్య మగ్గుతున్న వారూ ఉన్నారు.

మాదకద్రవ్యాల్లో రకాలు

- డ్రగ్‌ను ముక్కు ద్వారా పీల్చి తీసుకుంటే వాటిని 'ఇనేలంట్స్' అని అంటారు. ఇవి మనసును, మెదడును ఉద్రేకపరుస్తాయి. ఫలితంగా మాటిమాటికీ కోపం వస్తుంటుంది.
- 'సిఎన్ఎస్ స్టిమ్యులంట్'లు గుండె దడను పెంచి రక్తపోటు పెరిగేలా చేస్తాయి. శరీరాన్ని ఉద్రేకానికి గురిచేస్తాయి. అధిక కోపం, గుండెపోటు తలెత్తవచ్చు.
- 'సిఎన్ఎస్ డిప్రెస్సంట్స్' మెదడు, శరీరం పని తీరును మందగించేలా చేస్తాయి. ఇవి చిన్నపిల్లల్లో మరింత ప్రభావాన్ని చూపుతాయి.
- 'హలుసినోజెన్'లు తీసుకున్నప్పుడు వింతగా ఆలోచిస్తారు. తాము అనుకున్నదే నిజం అనుకుంటారు. రాత్రికి, పగలుకు తేడా గమనించలేరు.
- 'డిస్‌అస్సోసియేటివ్ అనస్థెటిక్స్' వల్ల నొప్పి తెలీదు. ఇవి ఉద్రేకాన్నీ తగ్గిస్తాయి. వీటిని తీసుకునే వారి భావోద్వేగాలు అందరిలా ఉండవు.



మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు

గంజాయి తీసుకునే వారిని అందులో ఉండే టెట్రాహైడ్రోకెనబినాయిడ్ అనే రసాయనం బానిసలుగా మారుస్తుంది. పిల్లలంటేనే ఉత్సాహానికి సంకేతం. వారు ఎలాంటి సాహసాలకైనా వెనుకడుగు వేయరు. కొత్త ప్రయోగాలను కోరుకుంటారు. ఈ క్రమంలోనే గంజాయి, డ్రగ్స్ వంటివి సరదాగా అలవాటవుతుంటాయి. మత్తు పదార్థాలు సేవిస్తే మెదడులో డోపమైన్, సెరటోనిన్ అనే ఉత్ప్రేరకాలు విడుదలవుతాయి. వాటివల్ల ఉత్తేజంగా ఉన్నట్టు అనిపిస్తుంది. అందుకే వీటిని మళ్లీ మళ్లీ కోరుకుంటారు. ఈ క్రమంలో బానిసలవుతారు. దానివల్ల శారీరకంగా, మానసికంగా అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మెదడుపై తీవ్ర ప్రభావం చూపి శ్రద్ధ, ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తుంది. చురుకుదనం సన్నగిల్లుతుంది. గంజాయి సేవించి వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయి. కార్మికులు పనిచేస్తున్న చోట ప్రమాదాల బారిన పడవచ్చు. గంజాయి, మత్తు పదార్థాలను సేవించిన తర్వాత వ్యక్తుల్లో చిత్తభ్రమలు మొదలవుతాయి. లేని మనుషులు ఉన్నట్లు, ఏదో చెబుతున్నట్లు భ్రమపడతారు.

అమ్మానాన్నలు ఆలోచించండి

'మా పిల్లలు అందరిలా కాదు' అని వారిపై అపారమైన నమ్మకాన్ని పెట్టుకోవడం తప్పు కాదు. ఫ్రీడమ్ ఇచ్చినందుకు పిల్లలు అన్నీ మీకు తెలిసేలానే చేస్తారు అనుకోవడం తప్పు. వారి మానసిక పరిస్థితిని ఎప్పుడూ గమనిస్తూ ఉండడం తల్లిదండ్రుల ప్రధాన బాధ్యత. పరిస్థితి చేజారిపోయాక ఏం చేసినా ప్రయోజనం ఉండదని గుర్తుపెట్టుకోవాలి. ఈ వ్యసనాలు మెడిసిన్‌తో తగ్గిపోయేవి కాదు. జరగాల్సిన నష్టం జరిగిపోయాక వారి లోపాన్ని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పిద్దామన్నా వారు దానికి ఒప్పుకోకపోవచ్చు. కాబట్టి వారికి చిన్నప్పటి నుంచే చెడు అలవాట్ల వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరంగా చెప్పాలి. ప్రేరణ కలిగించే మాటలు చెప్తే వారు కచ్చితంగా ప్రభావితమవుతారు. ఈ అలవాట్లు ఉన్నాయని తెలిసినప్పుడు నేరస్తునిలా, తప్పు చేసినవాడిలా కాకుండా ఆ ఉచ్చు నుంచి బయటపడేలా ప్రేరణ కలిగించాలి. బంగారు భవిష్యత్‌లో వారికంటూ ఒక లక్ష్యం నిర్దేశించి, దాని కోసం కృషి చేయాలని చెప్తే వారి దృష్టి మారవచ్చు. కిక్కు, థ్రిల్ ఈ వ్యసనాల్లోనే కాదు... చదువు, ఉద్యోగం, వ్యాపారాలలో కూడా దొరుకుతుందని వారు గమనించిన రోజు కచ్చితంగా ఉన్నత శిఖరాలపై నిలుస్తారు.

నేడు సైకిల్ ర్యాలీ

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం ఆరు గంటలకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించే అవగాహనా ర్యాలీలో యువత ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.



నివాళ్లర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు తదితరులు

ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు ఓంకార్ మృతి

నివాళ్లర్పించిన సిపిఎం, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



ఓంకార్ (ఫైల్)

ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఓంకార్ (52) విశాఖలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. పలాస మండలం మాకన్నపల్లికి చెందిన ఆయన ఓంకార్ మాస్టారుగా అందరికీ సుపరిచితులు. ఆయన తొమ్మిదో తరగతి చదువుతున్న రోజుల్లోనే ఎస్ఎఫ్ఐలో చేరి, శ్రీకాకుళం జిల్లా కమిటీ బాధ్యునిగా విద్యారంగ సమస్యలపై పోరాటం చేశారు. విద్యార్థుల పక్షాన పోరాటాలు చేశారు. తర్వాత ఆంధ్ర యూనివర్సిటీలో విద్యార్థి సంఘ నాయకునిగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. తర్వాత కాలంలో సిపిఎంలో చేరి పార్టీ పిలుపుమేరకు ప్రజా సమస్యలపై చేపట్టిన పోరాటాల్లో నాయకత్వం వహించారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తర్వాత కేవలం ఉపాధ్యాయునిగా బడిలో బోధనకే పరిమితం కాకుండా... ఐక్య ఉపాధ్యాయ సంఘం (యుటిఎఫ్)లో చేరి, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేశారు. ప్రజా చైతన్యానికి కళాకారునిగా, మేధావిగా, ఉపాధ్యాయ ఉద్యమ నేతగా ఉద్దానంలో గుండెచప్పుడై... సమస్యల పరిష్కారానికి ఉద్యమాలతో చెరగని ముద్ర వేశారు.

సమాజంలో జరుగుతున్న, ఎదుర్కొంటున్న అసమానతలకు వ్యతిరేకంగా చేపట్టే ఉద్యమాల్లో మమేకమై డప్పు కొట్టి, పాట పాడి రెట్టించిన ఉత్సాహంతో, ఉద్యమ స్ఫూర్తితో ముందుండేవారు. మహమ్మారి కిడ్నీ వ్యాధితో ఉద్దానం కూలిపోతుందని, ఉద్యమాలతోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఉద్దాన ప్రాంత ఆరోగ్య పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి, ఇచ్ఛాపురం నుంచి టెక్కలి వరకు పల్లె పల్లె తిరిగి ప్రజలను చైతన్యపరచడంలో ముఖ్య పాత్ర పోషించారు. ఉద్దాన ప్రాంత విద్యా అభివృద్ధి వేదిక వ్యవస్థాపకుల్లో ఒకరిగా, విద్యా సాంస్కృతిక రంగాల్లో తనదైన ముద్ర వేశారు. ఉపాధ్యాయ సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. నీలావతిలో యువివి గ్రంథాలయం నిర్మాణంలో చురుకైన పాత్ర వహించి, అనేక పుస్తకాల సేకరించి అందుబాటులోకి తెచ్చారు. మాకన్నపల్లిలో అశ్రు నయనాల నడుమ ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

ఓంకార్ మాస్టారు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. పలాసలోని ఆయన ఇంటి వద్ద నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. పలాస జీడి కాలుష్య సమస్యపై దశాబ్దపు కాలం పాటు సాగిన ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరినా సాధారణ జీవితమే గడిపి ప్రజా ఉద్యమాల వైపు ధృడంగా నిలిచారని చెప్పారు. ఆయన మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, జి.సింహాచలం, నాయకులు ఎన్.గణపతి, ఎన్.ఢిల్లేశ్వరి, యువివి నాయకులు కుత్తుమ్ ప్రకాశరావు, సిపిఐ నాయకులు సిహెచ్.వేణుగోపాల్, లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, గ్రామ సంఘం నాయకులు జి.నీలకంఠం, పలు ప్రజా సంఘాల, సంస్థల నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళ్లర్పించారు.

ఉపాధ్యాయ ఉద్యమాల్లో చెరగని ముద్ర

ఓంకార్ మాస్టారు మృతి ఉపాధ్యాయ ఉద్యమాలకు తీరని లోటు అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన కాలంలో ఉపాధ్యాయరంగ సమస్యలపై అనేక పోరాటాలు సాగించారని గుర్తు చేశారు. తన ఆరోగ్యం బాగాలేదని తెలిసినా రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమాల్లో పాల్గొనేవారని చెప్పారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, రాష్ట్ర కౌన్సిలర్లు పొందూరు అప్పారావు, ఉమాశంకర్, బి.చిట్టిబాబు, పలాస, వజ్రపుకొత్తూరు యుటిఎఫ్ నాయకులు సిద్ధేశ్వరరావు, ఎస్.వి రమణ, జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తదితరులు ఆయనకు నివాళ్లర్పించారు.

లెక్కలు పక్కాగా చూపాలి

ఎమ్మెల్యే కూన రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

మున్సిపాల్టీలో గత ఐదేళ్లలో నిధులకు సంబంధించిన లెక్కలన్నీ పక్కాగా ఉండాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు చూపించిన పలు గణాంకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పలు శాఖల్లో విధులు నిర్వహిస్తున్న తాత్కాలిక ఒప్పంద ఉద్యోగులకు, రికార్డుల్లో చూపిన గణాంకాలకు వ్యత్యాసం ఉండడాన్ని ప్రశ్నించారు. రెండు రోజుల్లో శాఖల వారీగా నిర్వహించే సమీక్షా సమావేశం నాటికి సరైన గణాంకాలు చూపకపోతే సహించేది లేదని మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. కొన్ని శాఖల సచివాలయ ఉద్యోగులను మున్సిపల్ ఒప్పంద ఉద్యోగుల స్థానంలో నియమిస్తే కొంతమేర ప్రభుత్వానికి ఆర్థికభారం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. 2019 నాటికి అప్పటి మున్సిపల్ పాలకవర్గం రూ.2.60 కోట్ల రూపాయల ఆదాయం చూపితే 2019 నుంచి 2024 వరకు 60 శాతం పన్నులు పెంచినా ఆదాయం పెరగకపోవడంలో ఆంతర్యం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు, వాలంటీర్లకు తక్షణమే పేపర్ బిల్లు నిలుపుదల చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడైనా సాక్షి పేపర్ కనిపిస్తే సహించేది లేదన్నారు. 2018 నాటికి మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల్లో 46 వేల జనాభా ఉంటే, గణాంకాల్లో మున్సిపల్ గ్రేడింగ్ కోసం 54 వేల జనాభా ఉన్నట్లు చూపడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ గ్రేడింగ్ పెరిగితే ఏమైనా ఆదాయం పెరుగుతుందా?, గ్రేడింగ్ వల్ల ప్రజల నెత్తిన అధిక పన్నుల భారం తప్ప సాధించే ప్రగతి ఏమైనా ఉందా అని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వంలో వసూలు చేసిన చెత్త పన్నుల సొమ్ము ఎక్కడికి వెళ్లాయని, వాటి పూర్తి వివరాలు చెప్పాలని ప్రశ్నించడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు బిక్క మొహం వేశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రాథమికంగా 23 వార్డులు ఉంటే రికార్డుల్లో 27 వార్డులు ఎందుకు నమోదు చేశారని ఇటువంటి గణాంకాలు చూపితే సహించేది లేదని హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల్లో నెలకొన్న సమస్యలపై పక్కా నివేదికలు తనకు అందించాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మార్కెట్, చింతాడ వారపు సంత ఆశీలు వేలంపాటను తక్షణమే నిర్వహించి మున్సిపల్ ఆదాయాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.రవి, మేనేజర్ బిషాయ్, ఎఇ బి.అప్పలనాయుడు, టిపిఒ హెచ్.సత్యనారాయణ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఆర్ఎయు విసి రజని

బిఆర్ఎయు అభివృద్ధికి సహకరించాలి

17వ వ్యవస్థాపక దినోత్సవంలో విసి రజని

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో అనుసంధానమైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం అభివృద్ధికి అన్ని వర్గాలు ముందుకు రావాలని వర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయ సర్వతోముఖాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, స్థానిక పరిశ్రమలు, ఎన్‌జిఒలు, వర్సిటీ పూర్వ విద్యార్థులు సహకారం అందించాలని కోరారు. వర్సిటీ సెమినార్ హాల్‌లో బిఆర్ఎయు 17వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక సవాళ్లు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఈ 16 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో విజయాలు, గుర్తింపులను బిఆర్ఎయు సాధించిందని చెప్పారు. వర్సిటీ పాలనలో పారదర్శకత, సామాజికన్యాయం, నాణ్యతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. బోధన, పరిశోధనల బలోపేతానికి కృషి చేస్తున్నామని చెప్పారు. వనరుల దుర్వినియోగం, వర్సిటీ విశిష్టతను దిగజార్చేలా వ్యవహరించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత మాట్లాడుతూ ప్రజాసంఘాలు, మేధావుల పోరాటాలతో ఆవిర్భవించిన బిఆర్ఎయును పరిరక్షించి ప్రగతి దిశగా పయనించేందుకు కృషి జరగాలన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయభాస్కర్ మాట్లాడుతూ పలు ఉపాధి అందించే కోర్సులతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందించడంలో బిఆర్ఎయు ముందుందని చెప్పారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.రాజశేఖర్, అకడమిక్ అఫైర్స్ డీన్ కె.స్వప్నవాహిని, సిడిసి డీన్ యు.కావ్యజ్యోత్స్న, చీఫ్ వార్డెన్ ఎన్.లోకేశ్వరి, పాలకమండలి సభ్యులు కె.మాధవి, కె.ఛత్రపతి తదితరులు మాట్లాడారు. అంతకుముందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి, విశ్వవిద్యాలయ చిహ్నానికి పూలమాలలు వేసి వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రారంభించారు. వర్సిటీ హాస్టల్ సిబ్బందికి నూతన వస్త్రాలను బహుకరించారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అసమర్థ పాలన వల్లే నీట్ ప్రశ్నాపత్రాలు లీకై విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షులు రవి, అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సహాయక కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు అన్నారు. ప్రశ్నా పత్రాల లీకేజ్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద ప్రదాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని అరసవల్లి కూడలి వద్ద ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన నీట్ పరీక్షా ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్ లో పరీక్ష రాయడం ప్రభుత్వ అసమర్థతకు తార్కాణమన్నారు. బీహార్‌కు చెందిన ముఠా ఒక్కో విద్యార్థి నుంచి రూ.30 లక్షలు వసూలు చేసినట్లు చెప్పినా, నిందితులను ఇంతవరకు అరెస్టు చేయకలేదన్నారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షా ఫలితాలు, పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.


నియోజకవర్గాన్ని నంబరు 1గా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో గల ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. పండగ వాతావరణంలో పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రాధాన్యతాక్రమంలో నెరవేర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈనెల 26వ తేదీ నుంచి శాఖలా వారీగా సమీక్షలు నిర్వహించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తన పరిధి దాటి ఉన్న సమస్యలను సంబంధిత మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో చివరి ఆయకట్టు వరకు సాగు నీరందేలా చర్యలు చేపట్టామని, వంశధార కుడి ప్రధాన కాలువను పరిశీలించి అడ్డంకులు గుర్తించామన్నారు. వాటిని తక్షణమే బాగు చేయాలని, లేకుంటే ఏడురోడ్ల కూడలిలో అమరణ నిరాహార దీక్ష చేస్తానని ఇరిగేషన్ అధికారులకు హెచ్చరించినట్లు తెలిపారు.

రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కంటే అదనంగా 350 క్వింటాళ్ల వరి విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు.



మాట్లాడుతున్న గొండు శంకర్

శ్రీకాకుళం-ఆమదాలవలస ప్రధాన రహదారి పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. సుదీర్ఘకాలంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిపై మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణతో మాట్లాడినట్లు చెప్పారు. అసంపూర్తిగా నిలిచిపోయిన స్టేడియం నిర్మాణ పనులూ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నిలిచిపోయిన టెండరు పనులను పూర్తి చేసి, నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. విలీన పంచాయతీల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. తనపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు సంరక్షకునిగానే ఉంటానన్నారు. ఎవరు ఎప్పుడు పిలిచినా తక్షణమే స్పందిస్తానన్నారు.



నినాదాలు చేస్తున్న ఎపిటిఎఫ్ సభ్యులు

పాఠశాల విద్య బలోపేతం చేయాలి

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, ప్రాథమిక విద్యకు ప్రతి గ్రామంలో ప్రాధాన్యత ఇవ్వాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు మొర్రి గోపి ప్రభుత్వాన్ని కోరారు. కవిటి ప్రాథమిక పాఠశాలలో మండల ఎపిటిఎఫ్ అత్యవసర సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతూ తీర్మానం చేశారు. అదే విధంగా మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి తల్లి అకాల మరణంపై సభ్యులు సంతాపం తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 117 జిఒ రద్దుచేసి నూతన పిఆర్‌సిపై కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమంతో పాటు ఆంగ్ల మాధ్యమం కొనసాగించాలని కోరారు. అనంతరం ఎపిటిఎఫ్ ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సమావేశంలో మండల గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి రంగారావు, ప్రధాన కార్యదర్శి గుడియా వంశీ, జిల్లా కార్యదర్శి శమల్ల రాజబాబు, కార్యవర్గ సభ్యుడు శ్రీధర్ సమంతో, భార్గవ్, శరత్, ప్రకాష్, భగవాన్, శ్రీకాంత్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో ఎమ్మెల్యే అశోక్

మాట రానివ్వను

కవిటి : బెందాళం ప్రకాష్ కొడుకుగా, ప్రగడపుట్టుగ - రామయ్యపుట్టుగ గ్రామానికి చెందిన వ్యక్తిగా తనపై ఎంతో బాధ్యత ఉందని, దానిని గుర్తెరిగి తన నుంచి గ్రామానికి ఎటువంటి మాట రానివ్వనని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ అన్నారు. ఎమ్మెల్యే అశోక్ సొంత గ్రామాలైన రామయ్యపుట్టుగ, ప్రగడపుట్టుగ ప్రజలు సోమవారం రాత్రి తమ ప్రియతమ నాయకుడిని ఆత్మీయంగా సత్కరించుకున్నారు. చిన్నప్పటి నుంచి తమలో ఒకడిగా ఉంటూ గత దశాబ్ది కాలంగా అత్యుత్తమ నాయకుడుగా ఎదిగిన వైనం గుర్తు చేసుకున్నారు. మాజీ ఎంపిపి, ఎమ్మెల్యే అశోక్ తండ్రి బెందాలం ప్రకాష్ రాజకీయ చతురత, టిడిపి ఆవిర్భావం నుంచి ప్రకాష్ పార్టీకి చేసిన సేవలు మననం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ఉన్న ఊరు కన్నతల్లితో సమానమని, తనకి ఎల్లవేళలా అండగా నిలిచి ఆదరించిన గ్రామస్తుల మనసెరిగి మసులుకుంటానన్నారు. అనంతరం ఇరు గ్రామాల ప్రజలు, పార్టీ నాయకులు, అభిమానులు ఎమ్మెల్యే అశోక్‌ను ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న రవికుమార్

రవికుమార్‌ను కలిసిన అంగన్వాడీ నాయకులు

ఆమదాలవలస : ఎమ్మెల్యే కూన రవి కుమార్‌ను ఆమదాలవలస ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ సంఘ నాయకులు మంగళవారం శ్రీకాకుళంలోని ఆయన స్వగృహం వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమదాలవలస ప్రాజెక్టు నుంచి పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి, పి. లక్ష్మి, కె.లత, కె.అరుణ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిధిలోని నిర్వాహకులు ఎదుర్కొం టున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్యే రవికుమార్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కవిటి: పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధవహిస్తే సహించేది లేదని డిఎల్‌పిఒ ఐవి రమణ అన్నారు. కవిటి మండలం కొత్తూరులో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. మరోవైపు మండలంలోని కార్యదర్శులతో సమావేశమైన ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. ప్రతి పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒ జి.వీరభద్రస్వామి, వార్డు సభ్యుడు సత్య, సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని మెళియాపుట్టిలో పారిశుధ్య పనులు మంగళవారం ఎంపిడిఒ జి.భాస్కరరావు పరిశీలించారు. కాలువలను శుభ్రం చేస్తూ చెత్తను తొలగించారు. మంచినీటి పథకం, బోర్ వెల్ ప్లాట్ ఫారం దగ్గర వీధుల్లో, కూడళ్లలో ఉన్న చెత్తను తొలగించి బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రేఖన వాసు, ఉప సర్పంచ్ మాడుగుల భానోజీరావు, కార్యదర్శి చింతల అప్పారావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కవిటి: పరిసరాల పరిశుభ్రతతో చాలావరకు వ్యాధులు నివారించవచ్చని బొరివంక పిహెచ్‌సి వైద్యాధికారి డా తేజ వెంకటేష్ అన్నారు. మలేరియా నిర్మూలనా మాసోత్సవాల్లో భాగంగా కుసుంపురంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ప్రతినిధి శివ బిసాయి, ఎంపిటిసి ప్రతినిధి కె.సత్యం, ఎంపిహెచ్‌ఇఒ బి.ప్రసాదరావు, హెచ్‌వి పద్మావతి, కార్యదర్శి రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్, ప్రింటర్ అందజేత

నౌపడ : సంతబొమ్మాళి మండలం మరువాడ ఎంపియుపి స్కూల్‌కు మరువాడ యువసేన యూత్ అసోసియేషన్ సభ్యులు రూ. 45 వేలు విలువచేసే కంప్యూటర్ పరికరాలు వితరణగా అందజేశారు. వీటిని విద్యా కమిటీ చైర్మన్ సూరాడ దాసరాజు చేతులమీదుగా హెచ్‌ఎం రాజీవ్‌కు అందించారు. దాసురాజు మాట్లాడుతూ యూత్, పెద్దలు సహకారంతో పాఠశాల అభివృద్ధికి డెల్ సిపియు, వ్యూ సోనిక్ మానిటర్, హెచ్‌పి ప్రింటర్ అందజేశామని తెలిపారు. మరువాడ యూత్ అసోసియేషన్, గ్రామ పెద్దలకు విద్యార్థులు తల్లిదండ్రుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ బదిలీ

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ కాలేజ్) ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖను పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కె.సూర్యచంద్రరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ అధికారులు, డిగ్రీ కళాశాల సిబ్బంది చేసిన ఫిర్యాదుల నిరూపణ కావడం, గతంలో రాజమండ్రి ఆర్‌జెడి ఇచ్చిన విచారణ నివేదికలు, విశాఖపట్నం కళాశాల ప్రిన్సిపాల్ నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. సిబ్బంది జీతభత్యాల చెల్లింపుల్లో అలసత్వం, కళాశాలలో సహృద్భావ వాతావరణం దెబ్బతీయడం, కళాశాల పవిత్రతను దెబ్బతీసేలా కార్యక్రమాలను చేపట్టడం వంటి కారణాల ఆధారంగా ఆమెపై చర్యలకు ఉపక్రమించారు.

మత్తుతో యువత జీవితాలు నాశనం



కవిటి : మాట్లాడుతున్న ఎస్ఐ రాము



ఆమదాలవలస : ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు



ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న సిఐ ఇమ్మన్యుయేల్ రాజు



బూర్జ : విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి- కవిటి

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తవుతాయని ఎస్ఐ రాము అన్నారు. స్థానిక ఎస్‌విజె విద్యా సంస్థల్లో డ్రగ్స్ రహిత ఎపి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో చిన్న వయసు నుంచే మత్తు పదార్థాలు వాడుతున్నారని, అందులోనూ విద్యార్థులే అధిక సంఖ్యలో ఉండడం దురదృష్టకరమన్నారు. మత్తు పదార్థాలు వాడకం ఒకసారి అలవాటైతే దాని ప్రభావం జీవితాంతం ఉంటుందని, దీంతో వాడినవారితో పాటు ఆ కుటుంబం కూడా వీధిన పడుతుందన్నారు. అంతే కాకుండా మత్తు పదార్థాలు వాడుతూ పట్టుపడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు వీటిపై అవగాహన పెంచుకుని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎం.భాస్కరరావు, పి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పిఒ ఆర్.మహేష్, జి. జగన్నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించడం వలన యువత జీవితం నాశనం అవుతున్నాయని సిఐ టి.ఇమ్మన్యుయేల్ రాజు అన్నారు. మంగళవారం స్థానిక జ్ఞాన భారతి విద్యా సంస్థలో విద్యా సంస్థల కార్యదర్శి జోహార్ ఖాన్ అధ్యక్షతన అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. విద్యాసంస్థల కార్యదర్శి జోహార్ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ, జ్ఞానభారతి ఎడ్యుకేషనల్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అడిషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌ఫోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్ధాలపై స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (ఎస్ఇబి) రణస్థలం స్టేషన్ ఎస్ఐ ఎం.రవిప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ పర్యవేక్షణలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగం వంటివి గుర్తిస్తే 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ో స్కూల్ ఉపాధ్యాయ బృందం పి.కృష్ణ, టి.ప్రసాద్, బాలామణి, సమత, స్రవంతి, సూర్యప్రకాష్, లక్ష్మణరావు, జోష్నా, పర్వీన్, ఝాన్సీ, ఎస్ఇబి సిబ్బంది జగదీశ్ బాబు, ఖుద్దుస్, జి.శివాజీ గణేష్, ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.


ఆమదాలవలస: మాదకద్రవ్యాలకు ప్రజలు, యువత దూరంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.దివాకర్ యాదవ్, ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ కె.రాజారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి జె.రవిబాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గణపతి, ధనుంజయరావు, ఎస్ఇబి సబ్ ఇన్‌స్పెక్టర్లు కరుణలత, నాగరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని మెయిన్ రోడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించి మాదకద్రవ్యాల నిషేధంపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ: విద్యార్థులు చెడు వ్యసనాల పట్ల ఆకర్షితులై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ జి.వి.ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సువ్వారి తవిటి నాయుడు, ఆధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుడు వార్తలు సరికాదు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఇటీవల తనపై, తన వర్గీయులపైన తప్పుడు వార్తలు ప్రచురిస్తూ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వార్తలు రాయటం తగదని ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదేళ్లగా వైసిపి అనుచరులు, స్థానిక యుపి పరిశ్రమలో కార్మిక నాయకుడైనందున వారి అక్రమ వసూళ్ల దాటికి ఇబ్బందులకు గురై సత్సంబంధాలు చెడిన పరిస్థితుల్లో యాజమాన్యానికి, కార్మికులకు సయోధ్య చేసే విధంగా తాను వ్యవహరించానే తప్ప దాడులు చేయమని ఎప్పుడు ప్రోత్సహించలేదన్నారు. పరిశ్రమను ఎప్పుడు అభివృద్ధిలో ఉంచేందుకే తాను ప్రయత్నించానని అయితే యాజమాన్య సిబ్బంది, నాయకులు లేనిపోని ఆరోపణలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో న్యాయపరమైన పోరాటం చేయడం జరుగుతుందని పరిశ్రమను ఎవరు ఇబ్బంది కలిగించిన ఊరుకునేదే లేదని పేర్కొన్నారు.



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

ఉపాధి హామీ పనులు ప్రారంభం

వజ్రపుకొత్తూరు: గోవిందపురం పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనులను టిడిపి నాయకులు మాజీ ఎంపిటిసి కర్ని రమణ, గోవిందపురం పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలతో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించి పర్యవేక్షించినట్లు తెలిపారు. గోవిందపురంలో కొత్త చెరువు, సీతంపేట గ్రామంలో కొత్త ట్యాంక్ చెరువులో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద చెరువు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉపాధి పథకం కింద కూలీలకు వంద రోజుల పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ గుంట సత్యం, మాజీ కో-ఆప్షన్ సభ్యులు పాలవలస వేణుగోపాల్, మెట్ట నారాయణ, పాలిన మోహనరావు, గొర్లె గణేష్, గొరకల దండాసి, పాలిన చంద్రయ్య, పూడి రమణ, పాలిన నాగు, పాలిన అప్పారావు, పుచ్చ అప్పలస్వామి, మొఖలింగం, సైని చినబాబు ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చక్రాల కుర్చీ అందజేత

శ్రీకాకుళం అర్బన్: వింత వ్యాధితో బాధపడుతూ నడవ లేని స్థితిలో ఉన్న ఢిల్లీశ్వరరావుకు చక్రాల కుర్చీని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మంగళవారం ఢిల్లీశ్వర రావు ఇంటికి వెళ్లి కుర్చీని అందజేశారు. ఢిల్లీశ్వరరావు తండ్రి రాము నగరంలోని ధమ్మలవీధిలో నివాసముంటూ తోపుడు బండిపై అరటిపళ్లను అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు కాగా పెద్ద కొడుకు ఢిల్లీశ్వరరావుకు రెండేళ్ల క్రితం వింత వ్యాధి సోకింది. ఫోస్ - ఎస్ఎస్‌పిఇ అనే వ్యాధి సోకడం వల్ల కాళ్లు చచ్చుబడి కుర్చీకే పరిమితమయ్యాడు. చికిత్స కోసం పలు ఆస్పత్రుల్లో వైద్యులకు చూపించి సుమారు రూ.రెండున్నర లక్షలు ఖర్చు చేసినా నయం కాదని వైద్యులు తేల్చి చెప్పారు. ఈ వ్యాధి చిన్న కుమారుడు యస్వంత్‌కు కూడా సోకడంతో ఆ కుటుంబం ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉంది. వారికి వైద్యం అందించినా ప్రయోజనం లేదని చెప్పడంతో కుటుంబం కన్నీటి పర్యాంతమవుతున్నారు. వారి ఆర్థికస్థితి సరిగాలేక వీల్‌చైర్‌లను కొనే స్థోమతలేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న నంది ఉమాశంకర్, పలువురు సహకారంతో వీల్‌చైర్‌ను కొనుగోలు చేసి అందజేశారు. కార్యక్రమంలో సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి ప్రతినిధి పొడుగు చరణ్, ధమ్మలవీధికి చెందిన తవుడు పాల్గొన్నారు.

'మనం' ఆర్థికసాయం


కవిటి: గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న జల్లుపుట్టుగకు చెందిన దాశరథి దళాయికి మనం స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. మంగళవారం గ్రామానికి చేరుకున్న సంస్థ సభ్యులు మాట్లాడి ఓదార్చారు. తక్షణసాయంగా రూ.35వేలు అందించారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ దళాయి కుటుంబానికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు అండగా నిలవాలని కోరారు.

సమస్యలపై దృష్టిసారించాలి

పొందూరు: గత ప్రభుత్వంలో గ్రామాల్లో అపరిష్కృతం కాని సమస్యలను పరిష్కరించేందుకు దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన సైనికులకు సూచించినట్లు ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన పార్టీ సంస్థాగతంగా బలోపేతం కావడానికి పనిచేయాలని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్



శ్రీకాకుళం రూరల్ : విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని శాసనసభ్యులు గొండు శంకర్ సూచించారు. నియోజకవర్గ పరిధిలోని గార మండల కేంద్రంలో సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతన్నల నడ్డి విరిచిందని ఆరోపించారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు అందక, అష్టకష్టాలు పడి పంట పండించినా గిట్టుబాటు ధర లేక, బిల్లులు చెల్లించకపోవడంతో రైతాంగం గడ్డు పరిస్థితులు ఎదుర్కొందన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతుకు అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మేలైన, అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలను వ్యవసాయశాఖ ద్వారా సిద్ధంగా ఉంచడం జరిగిందని చెప్పారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకుని, అధిక దిగుబడులు సాధించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీ విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎడి జి.రజని, ఎఒ డి.పద్మావతి, ఎంపిడిఒ బి.కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం కొత్త లింగోడు రైతు భరోసా కేంద్రంలో రైతులకు సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ మేరకు మూలపేట మాజీ సర్పంచ్, టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు చేతులమీదుగా రైతులకు అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ విత్తనాలు రైతుల వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆగ్రికల్చర్ అసిస్టెంట్ గౌతమి, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

పైనాపిల్ ఉత్పత్తులపై శిక్షణ

ఆమదాలవలస: పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై రెండు రోజుల వృత్తి శిక్షణా కార్యక్రమాన్ని గిరిజన యువతీ యువకులకు నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యంలో శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైనాపిల్ ఆస్కార్బిక్ యాంటీ ఆక్సిడెంట్స్, బ్రోమెలిన్ అనే ఎంజైమ్, పీచుపదార్థం మొదలైనవి ఉండటంవలన శక్తిని పెంపొందించి జీర్ణక్రియ వ్యవస్థ చక్కగా పనిచేయడమే కాకుండా కేన్సర్‌ను నియంత్రించే కారకాలు ఉండడం ఆరోగ్యానికి మంచిదన్నారు. పైనాపిల్ పండ్లు జూన్, జూలై, ఆగస్టు నెలలో విరివిగా దొరుకుతాయన్నారు. మంగళవారం పైనాపిల్‌తో స్క్వాష్ జామ్ తయారీ విధానం నేర్పించడమే కాకుండా గిరిజన రైతులకు, మహిళా రైతులకు శిక్షణను, వెలుగు అసోసియేషన్ సంస్థకు చెందిన ఆదివాసి రైతు ప్రగతి ఎఫ్‌పిఒకు 20 మంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నీలవేణి, డాక్టర్ వి. హరికుమార్, డాక్టర్ ఎస్.అనూష, డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, వెలుగు అసోసియేషన్ ఏరియా కో-ఆర్డినేటర్ ఎస్.ఆనంద్, వసంత శంకర్ పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌బాబు

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే అశోక్ బాబు అన్నారు. ఇచ్ఛాపురం మండలం ధర్మా పురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే విద్యార్థుల తలరాతలు మారుతుందని, తల్లి తండ్రులు, విద్యారులు విద్యపై నిర్లక్ష్యం చూపించరాదన్నారు. శత శాతం ఫలితాలు సాధించిన ఈ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంచి పౌరులుగా పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాటశాలలో ఒక మేస్త్రి కొడుకు కైలాస బాడిత్యా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఎమ్మెల్యే ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి అప్పారావు, హెచ్‌ఎం ఎస్.విశ్వనాథ్, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, మాజీ ఎంపిపి ఢిల్లీరావు, టిడిపి నాయకులు హేమరాజు, బోనామాలి రెడ్డి, మెరుగు సూర్యనారాయణ. సహదేవ్ రెడ్డి, ఎల్.పద్మనాభం, దక్కత శ్రీను, కామేశ్వరరావు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- పాతపట్నం

మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. మండల అధికారుల పరిచయాలతో మొదలైన ఈ సభలో మండలంలో ఉన్నటువంటి ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా విద్యుత్ సమస్యలు, రోడ్డు సమస్యలు ఉన్నట్లు గుర్తించిన ఎమ్మెల్యే ఆ శాఖ అధికారులకు దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే బైధిలాపురం పిహెచ్‌సికి ఇద్దరు వైద్యులకు ఒక డాక్టరే ఆస్పత్రిలో కనిపిస్తున్నారని ఆర్ఆర్ఆర్ ఎల్ పురం గ్రామ సర్పంచ్ ప్రతినిధి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ ఎం. కరుణాకరరావు, జెడ్‌పిటిసి లింగాల ఉషారాణి, ఎంపిపి సావిత్రమ్మ, ఎం.గణపతిరావు, ఎంపిడిఒ రామకృష్ణంరాజు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు పరిశీలన



అక్రమ నిర్మాణాలపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న గ్రామస్తులు

ఇచ్ఛాపురం: మండలంలో తులసిగామ్ పంచాయతీ పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయం వద్ద ఎటువంటి పట్టాలు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు గ్రామస్తులు ఎమ్మెల్యే అశోక్ బాబుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ధర్మాపురం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు రోడ్డుపక్కన దర్జాగా కబ్జా చేసి అయిదు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని చూపించి తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ అక్రమ నిర్మాణాలకు వైసిపికి చెందిన నేతలకు లక్షలు రూపాయలు ముట్టచెప్పరని గ్రామస్తులు ఆరోపించారు. సంబంధిత అధికారులకు అడిగి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే చెప్పారు. అవసరమైతే డబ్బులు ఇచ్చినట్లు రుజువులు ఉన్నట్టయితే సంబధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టడానికి వెనుకాడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో తులసిగామ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆభరణాల చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి వంశధార కాలనీలో నివాసం ఉంటున్న బ్యాంకు మేనేజర్ ఇంట్లో 5 తులాల బంగారు ఆభరణాలతో పాటు కిలో వెండి వస్తువులు చోరీకి గురైనట్లు మేనేజర్ భార్య జయశ్రీ మంగళవారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము ఇంట్లో లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వరుస దొంగతనాల నేపథ్యంలో పోలీసులు దర్యాప్తులో భాగంగా పట్టణంలోని పలు సిసి కెమెరాలను పరిశీలించారు.

పిడుగుపాటుకు గడ్డికుప్ప దగ్ధం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో సంత లక్ష్మీపురానికి చెందిన జి.పోలయ్యకు చెందిన గడ్డికుప్ప మంగళవారం సాయంత్రం కురిసిన వర్షం సమయంలో పిడుగు పడి కాలిబూడిదైంది. గడ్డికుప్ప సమీపంలో వెదురుతుప్ప మీద పడి ప్రమాదం జరిగింది. పలాస అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి- బూర్జ

మండలం ఒవిపేట ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న రెండేసి సీట్లు భర్తీ కోసం ఈ నెల 27 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 29న ఉదయం 9.30 గంటలకు ప్రవేశ పరీక్షకు హాజరు కావాలన్నారు. విద్యార్థులు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని సూచించారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

ప్రజాశక్తి- బూర్జ

ప్రస్తుతం బ్యాంకుల్లో జరుగుతున్న డిజిటల్ లావాదేవీలపై లబ్ధిదారులు అవగాహన కలిగి ఉండాలని ఎపిజివిబి అసిస్టెంట్ మేనేజర్ కె.సతీష్ అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయంలో మంగళవారం లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంకుల్లో ఎన్నో రకాల మార్పులు చోటు చేసుకున్నాయని, లబ్ధిదారులకు ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. దీనివలన ప్రతిఒక్క లబ్ధిదారుడు బ్యాంకుల్లో డిపాజిట్లు వివరాలు తెలుసుకోవాలన్నారు. అలాగే డబ్బులను బదిలాయింపు, ఇతర వివరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరు కావాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వైసిపి విస్తృతస్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 26న ప్రగతి భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సభ్యులు

ఘనంగా 'మాతృమూర్తి' వార్షికోత్సవం

ప్రజాశక్తి- కవిటి

మండలంలో కుసుంపురం కేంద్రంగా పనిచేస్తున్న మాతృమూర్తి యువజన సేవా సంఘం 15వ వార్షికోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా కుసుంపురంకు చెందిన జుత్తు అమ్మడమ్మ కుటుంబానికి అన్నపూర్ణ అమృతహస్తం పేరిట నెలకు సరిపడే నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న అర్జి లక్ష్మణ్ అనే యువకుడికి రూ.3వేలు ఆర్థికసాయం అందించారు. అనంతరం సీతయ్య ఫౌండేషన్‌లో కేకు కట్ చేసి వృద్ధులు, అనాథలకు అన్న వితరణ కార్యక్రమం చేపట్టారు.



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

పశువులకు టీకాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో పట్టుపురం, పాకివలస, పొన్నాన పేట, మెండపేట తదితర గ్రామాల పరిధిలో 248 పశువులకు మంగళవారం గొంతు, జబ్బవాపు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ తెలిపారు. వర్షాకాలం ప్రారంభమ వడంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని, పాడి రైతు లందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని కోటబొమ్మాళి సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం.లోకనాధం పరిశీలించారు. కార్యక్రమంలో తిలారు పశువైద్యాధికారి ఎం.ప్రజ్ఞచైతన్య, వి.ఎ. ముకుందరావు, బాలమ్మ, నారాయణరావు, గోపాల మిత్ర అప్పల నాయుడు, ధర్మారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌కు స్వాగత ఏర్పాట్లు

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారిగా నియోజకవర్గానికి వస్తున్న నడుకుదిటి ఈశ్వరరావుకు కూటమి నాయకులు ఘనంగా స్వాగతం ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 11 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి బయలుదేరి భోగాపురం వద్ద భోజనం ఏర్పాట్లు చేసుకుని అనంతరం 3 గంటలకు జిల్లా ముఖద్వారం పైడిభీమవరం నుంచి తన స్వగ్రామమైన నడుకుదిటి పాలెం వరకు భారీగా స్వాగతం ఏర్పాట్లు చేస్తున్నారు.

లావేరు: ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసి వస్తున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌కు ఘనస్వాగతం చెప్పే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ ప్రకటనలో తెలిపారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.